‘మన బస్తీ- మన బడి’తో అభివృద్ధి

- రూ.2.46 కోట్ల నిధులతో అదనపు తరగతి గదుల నిర్మాణం
- తుది దశకు చేరిన పనులు
- విద్యార్థులకు సమకూరనున్న వసతులు
- ఉపాధ్యాయుల కొరతతో ఇబ్బందులు
- కేటాయించాలని విద్యార్థుల వేడుకోలు


బాలుర ఉన్నత పాఠశాలలో తుది దశకు చేరుకున్న అదనపు తరగతి గదుల నిర్మాణం

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మన బస్తీ- మన బడి పథకం కింద చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. భవన నిర్మాణ పనులు పూర్తి అయితే తరగతి గదుల కొరత తీర నుంది. అయితే పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో సరిపడ గదులు లేక అటు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతూ చెట్ల కింద తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ప్రభుత్వం చేపట్టిన మన బస్తీ- మన బడి పనులతో 700 మంది విద్యార్థులకు కావాల్సిన వసతులు సమకూరనున్నాయి. ఈ పనులన్నీ పూర్తి కావస్తుండటంతో పాఠశాలకు కార్పొరేట్ కళ సంతరించుకోనుంది. త్వరితగతిన పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తే బాగుంటుందని ఉపాధ్యాయులు, విద్యార్థులు అంటున్నారు. కొన్ని సబ్జెక్ట్‌లకు ఉపాధ్యాయులు లేరని వారిని కేటాయించాలని కోరుతున్నారు.

రూ.2.46 కోట్ల నిధులు మంజూరు..

గొప్ప చరిత్ర ఉన్న ఈ పాఠశాలలో శిథిలావస్థకు చేరిన గదులను ఐదేళ్ల కిందట కూల్చివేయడంతో గదులు కొరత ఏర్పడింది. ప్రభుత్వం నుంచి మన బస్తీ- మన బడి పథకం కింద రూ.2.46 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో 14 అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు జరుతున్నాయి. వీటిలో నాలుగు తరగతి గదుల నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి. వీటితో పాటు విద్యార్థులకు డైనింగ్ హాల్, పూర్తి స్థాయిలో నీటి వసతి, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టారు. ఇక మున్సిపల్ నిధుల నుంచి రూ.30 లక్షలు మంజూరు కాగా వాటితో మరో మూడు గదులు నిర్మాణం చేపట్టగా ఆ పనులు పూర్తయ్యాయి. ఇవేకాకుండా మరో రూ.13 లక్షలతో ఫర్నీచర్‌కు నిధులు మంజూరయ్యాయి.

గదుల నిర్మాణంతో ఇబ్బందులు తొలగనున్నాయి


మా పాఠశాలలో కొత్త గదుల నిర్మాణంతో చెట్ల కింద కూర్చొని పాఠాలు వినే బాధ తప్పుతుంది. భోజనం చేసేందుకు కూడా డైనింగ్ హాల్ నిర్మిస్తున్నారు. అదీ పూర్తయితే బయట కూర్చొని అన్నం తినే సమస్య కూడా ఉండదు.

– సాయిశ్రీ, 9వ తరగతి, విద్యార్థి

పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉంది


పాఠశాలలో 700 మంది విద్యార్థులున్నారు. గదుల కొరతతో విద్యార్థులకు చెట్ల కిందనే పాఠాలు చెప్పాల్సి వస్తోంది. మధ్యాహ్న భోజనాలు కూడా ఆరుబయటే చేస్తున్నారు. తరగతి గదుల పనులు పూర్తయితే సమస్య పరిష్కారం అయినట్లే. పాఠశాలలో ఇంకా ఆరుగురు ఉపాధ్యాయులు అవసరం ఉంది. ప్రస్తుతం జరిగే బదిలీల్లో కొత్తవారు వస్తే ఆ సమస్య కూడ తీరుతుంది.

– శ్రీనివాసరెడ్డి, హెచ్‌ఎం, బాలుర ఉన్నత పాఠశాల, కోదాడ

కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి


దాత సుమంత్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నేరేడుచర్ల : నేరేడుచర్లకు చెందిన వ్యాపారి ఐత సుమంత్ జన్మదినం సందర్భంగా మండలంలోని దిర్శించర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు మాట్లాడుతూ విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన కోరారు. అనంతరం దాత సుమంత్‌ను వారు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కట్ట మాధవి, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, యాదగిరి, వెంకటలక్ష్మి, స్వాతి, అంగన్‌వాడీ కేంద్రం టీచర్ వెంకటరమణ, సిబ్బంది సఫీయా, వెంకటకృష్ణ, శబీనా తదితరులు పాల్గొన్నారు.

బొల్లం మల్లయ్యయాదవ్ గెలుపునకు కృషిచేస్తాం

నడిగూడెం : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కోదాడ ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్‌ను రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపించడానికి కృషి చేస్తామని బీఆర్‌ఎస్‌వీ జిల్లా నాయకుడు కేశబోయిన మురళీకృష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. మల్లయ్యయాదవ్ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని అన్నారు. సమావేశంలో నాయకులు బీఆర్‌ఎస్‌వీ మండల అధ్యక్షుడు మేకల వీరేశం, ప్రధాన కార్యదర్శి కాసాని వెంకటేష్, నాయకులు పందిటి నవీన్, సందీప్, ఫయాజ్, నమృత్ తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనం నిర్మించాలి

మునగాల : మండల పరిధిలోని సీతానగరంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరి కూలేలా ఉందని, తక్షణమే నూతన భవనం నిర్మించాలని ఎస్‌ఎస్‌యూఐ మండల ఇన్‌చార్జ్ గోగుల లక్ష్మణ్ కోరారు. సీతానగరంలో శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనాన్ని సోమవారం సందర్శించి మాట్లాడారు. పాఠశాల పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ఒకే తరగతి గదిలో ఐదు తరగతులకు విద్యాబోధన జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు సరిపడ బెంచీలు లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నూతన భవనం నిర్మించి సౌకర్యాలు కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌యూఐ నాయకులు పి.నరేష్, ఎస్.బస్వంత్, డి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ధరలు తగ్గించాలని సీపీఎం రాస్తారోకో


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

హుజూర్‌నగర్ రూరల్ : రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి పి.హుస్సేన్ డిమాండ్ చేశారు. పార్టీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం మండలంలోని గోపాలపురంలో రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం మోదీ ప్రభుత్వ పాలనలో నిత్యావసర ధరలను విపరీతంగా పెంచుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ భూస్వామ్య విధానాలను అమలు చేస్తూ నూటికి 90 శాతం ఉన్న పేద, మధ్యతరగతి కార్మిక వర్గాల ప్రజల అవసరాలను, సంక్షేమాన్ని విస్మరించారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం కల్పిస్తామని చెప్పి ఊరుకో ఉద్యోగం కూడా ఇవ్వలేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సిద్దిల వెంకటయ్య, చందాల భిక్షం, జిట్టబోయిన అరవింద్, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, విజయలక్ష్మి, రాములమ్మ, వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

‘మధ్యాహ్న’ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న మహిళా కార్మికులు

మఠంపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండిపెడుతున్న ఏజెన్సీ మహిళా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎంఈఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు అనుగుణంగా బిల్లులు చెల్లించాలని, గౌరవ వేతనం నెలకు రూ.5వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ సయ్యద్ రన్మియా, ఏజెన్సీల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు శాంతకుమారి, ధనమ్మ, గోవిందమ్మ, పుష్ప, దానమ్మ, పద్మ, సాలమ్మ, రాధమ్మ, మంగమ్మ, లత, రాజ్యలక్ష్మి, సైదమ్మ, కమలమ్మ, ఏ.పద్మ, ఎల్లమ్మ, ఆర్.పద్మ, లచ్చిరామ్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలు


మాసోత్సవాల్లో పాల్గొన్న శాస్త్రవేత్త సుగంధీ, అంగన్‌వాడీ టీచర్, గర్భిణులు, బాలింతలు

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రం– 2 లో సోమవారం పోషణ మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే మై హోం సెన్స్ శాస్త్రవేత్త సుగంధీ, అంగన్‌వాడీ టీచర్ అనిత మాట్లాడుతూ గర్భిణులు పోషక ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు ఉమ, దివ్య, శైలజ, నాగమణి, కావ్య, రావేస్, విద్యార్థినిలు శ్వేత, స్నేహ, అక్షిత, సింధూజ, హర్షిత, మధుమిత, రజిత, నాజ్నీన్, పుష్ప తదితరులు ఉన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ బోనాలు


మఠంపల్లి : వర్దాపురంలో బోనాలతో మహిళలు


గరిడేపల్లి : మంగాపురంలో..

మఠంపల్లి : శ్రావణమాసం సందర్భంగా ఆదివారం మండలంలోని వర్దాపురంలో గ్రామదేవత ముత్యాలమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ బచ్చలకూరి అఖిలతో పాటు మహిళలు బోనాలు ఎత్తుకుని డప్పుచప్పులతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు బచ్చలకూరి బాబు, పెద్దకాపు వెంకట్‌రెడ్డి, అనంతరామయ్య, రామయ్యగౌడ్, గోపయ్యయాదవ్, దుర్గయ్యగౌడ్, లింగయ్యగౌడ్, చినసైదులు, గుండు శ్రీను, ఏ.శ్రీను, వార్డుసభ్యులు అబ్దుల్లా, గ్రామస్తులు పాల్గొన్నారు.

మంగాపురంలో..

గరిడేపల్లి : మండలంలోని మంగాపురం గ్రామంలో సోమవారం ముత్యాలమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ప్రదర్శనగా ముత్యాలమ్మ ఆలయానికి తరలివెళ్లి అమ్మవారికి ఇష్టమైన వంటకాలకు నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలి


మాట్లాడుతున్న సర్పంచ్ పఠాన్ జానీబీ

మఠంపల్లి : ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఉచితంగా సరఫరా చేస్తున్న పోషక ఆహారాన్ని గర్భిణులు, బాలింతలు తీసుకుని తల్లిబిడ్డలు ఆరోగ్యంగా ఉండాలని సర్పంచ్ పఠాన్‌జానీబీ కోరారు. సోమవారం రఘునాథపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషకాహార మాసోత్సవాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆకుకూరలు, పప్పులు, గుడ్లు, క్యారెట్, బీట్‌రూట్, తదితర పోషకాహార పదార్థాలను అంగన్‌వాడీ టీచర్లు ప్రదర్శించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కాశమ్మ, జ్యోతి, అచ్చమ్మ, ఆశ వర్కర్ ప్రమీల, అమీనా, రత్నకుమారి, జానిబేగం, రజియాబేగం, నుస్రత్‌బేగ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత


మునగాల : ఆర్థికసాయం అందజేస్తున్న శాలివాహన వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

మునగాల : మండల కేంద్రానికి చెందిన కోదాటి వెంకయ్య ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందాడు. సోమవారం గ్రామానికి చెందిన శాలివాహన వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మృతుడి కుటుంబానికి రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సిరికొండ అంతయ్య, సభ్యులు, శాలివాహన కుల పెద్దలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు సుధా బ్యాంక్ రుణ మేళా

కోదాడ : పట్టణంలోని కోర్టు ఎదురుగా ఉన్న సుధా అర్బన్ కోపరేటివ్ బ్యాంక్ ఆధ్వర్యంలో బుధవారం రుణ మేళా నిర్వహిస్తున్నట్లు ఆ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటి మరమ్మతులు, వ్యాపార విస్తరణ, వాహనాల కొనుగోలు, గిడ్డంగుల నిర్మాణం వంటి అన్ని రకాల వ్యాపారాలకు ఈ రుణమేళాలో రుణసదుపాయం కల్పిస్తామని పేర్కొన్నారు. పట్టణంతో పాటు పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వివిధ కేసుల్లో రూ.1.75 లక్షల జరిమానాలు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ న్యాయ స్థానం పరిధిలోని హుజూర్‌నగర్, మఠంపల్లి, మేళ్లచెరువు, చింతలపాలెం, గరిడేపల్లి, నేరేడుచర్ల, పాలకవీడు పోలీస్ స్టేషన్‌లలో నమోదైన వివిధ రకాల 14 కేసులలో సోమవారం కక్షిదారులు న్యాయమూర్తి మారుతి ప్రసాద్ ఎదుట తమ నేరాలు అంగీకరించారు. దీంతో న్యాయమూర్తి 63 కేసులతో వారికి రూ.1.75 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. జరిమానాను ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని తీర్పులలో పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి

గరిడేపల్లి : సైబర్ నేరాలు, సోషల్ మీడియా ప్రకటనల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని గరిడేపల్లి ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గడ్డిపల్లి మోడల్ స్కూల్‌లో ప్రధానమంత్రి డిజిటల్ సాక్షరత అభియాన్ సర్టిఫికేట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ లిటరసీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు సెల్ ఫోన్లకు బానిసలు కావద్దన్నారు. అనాధికార వెబ్‌సైట్లను ఉపయోగించడంతో డేటా హ్యాకర్ల చేతుల్లోకి వెళ్తుందన్నారు. ఆడపిల్లలు ఎవరి వల్ల అయిన ఇబ్బందులకు గురైతే పరిసర పోలీస్ స్టేషన్‌కు గాని, షీటీమ్స్, 100 నెంబర్‌కు గాని సమాచారం అందించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్, ఉపాధ్యాయులు రాము, వీఎల్ఈ జగదీష్, విద్యార్థులు ఉన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ


విభళాపురంలో వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మోతె : కోదాడ నియోజకవర్గంలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ చేసిన అభివృద్ధి, అమలు చేసిన పథకాలపై ప్రచరించిన వాల్ పోస్టర్‌ను మండలంలోని విభళాపురంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శీలం సైదులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ బడుగు బలహీన వర్గాలకు అండగా ఉండి ఆర్థిక భరోసా కల్పించారన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

10, 11 తేదీల్లో ముత్యాలమ్మ జాతర


సమావేశమైన జాతర కమిటీ సభ్యులు

హుజూర్‌నగర్ : పట్టణంలో ప్రతిఏటా శ్రావణమాసంలో నిర్వహించే ముత్యాలమ్మ జాతర ఈనెల 10, 11 తేదీల్లో జరపాలని జాతర కమిటీ నిర్ణయించింది. సోమవారం పట్టణంలోని అమ్మవారి ఆలయం వద్ద జాతర కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతరలో భాగంగా ఈనెల 7న పట్టణంలో సల్లకుండ ఎత్తే కార్యక్రమం ప్రారంభమై 10న పెద్ద ముత్యాలమ్మ తల్లి, 11న చిన్న ముత్యాలమ్మ తల్లి జాతర, 14న కనకదుర్గమ్మ అమ్మవారి జాతర నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. పట్టణ ప్రజలందరూ జాతరలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, కుల, పట్టణ పెద్దలు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నడిగూడెం : మండల పరిధిలోని రత్నవరంనకు చెందిన కలకొండ గోపాలస్వామి (30) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో సోమవారం అదే గ్రామానికి చెందిన జీఎస్సీ విక్టరీ ఫౌండేషన్ చైర్మన్ వెంకటేష్‌గౌడ్ మృతుని కుటుంబానికి రూ. 5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఇన్‌చార్జ్ నందిగామ రామారావు, సభ్యులు పోలంపల్లి నర్సింహారావు, కలకొండ సాల్మన్, ఉప్పలయ్య, యేసు, రాజు పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్


కోదాడ : పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడ : సబ్బండ వర్గాల అభివృద్ధే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. సోమవారం కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మునగాల మండలంలోని వెంకట్రాంపురం, సీతానగరం గ్రామాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపునిస్తామని తెలిపారు. ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తొగరు రమేష్, సీతారాములు, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, శంకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల జీవితాల్లో వెలుగులు

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి


సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వీఓఏలు, పాల్గొన్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లింల జీవితాల్లో వెలుగులు నింపారని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. మైనార్టీ సంక్షేమ శాఖ నుంచి వివిధ వృత్తులు చేసుకునే నియోజకవర్గంలోని 36 మంది మైనార్టీలకు నూరు శాతం సబ్సిడీతో మంజూరైన రూ.1 లక్ష ఆర్థిక సహాయం చెక్కులను సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అదేవిధంగా నియోజకవర్గంలోని పాలకవీడు, మఠంపల్లి మండలాల్లోని 84 మంది పోడు రైతులకు మంజూరైన భూముల పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యా, సామాజిక పరంగా మైనార్టీలను అభివృద్ధి చేయడమే కాకుండా మైనార్టీ విద్యార్థుల విదేశీ విద్య కోసం ఆర్థిక సహాయం చేస్తుందని తెలిపారు. పోడు రైతులను భూమి యజమానులుగా చేసి వారికి ఆయా భూములను సేద్యం చేసుకునే హక్కులు కల్పించిందన్నారు. కార్యక్రమంలో మైనార్టీ జిల్లా అధికారి జగదీశ్వరరెడ్డి, డీటీడీఓ శంకర్, తహసీల్దార్లు శ్రీదేవి, మంగ, జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ జయబాబు, సర్పంచ్‌లు పి.శంకర్‌రెడ్డి, శిరీష, నాయకులు చింతారెడ్డి సైదిరెడ్డి, దొంతగాని శ్రీనివాస్, ముడెం గోపిరెడ్డి, పెండెం శ్రీనివాస్, హరిబాబు, అమర్‌నాథ్‌రెడ్డి, కృష్ణానాయక్, అమర్‌గౌడ్, గుండా బ్రహ్మారెడ్డి, కొండానాయక్, జయమ్మ, సీతారామయ్య, అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వీఓఏలను గుర్తించింది కేసీఆర్ మాత్రమే..

హుజూర్‌నగర్ : రాష్ట్రంలోని వీఓఏలను గుర్తించి, గౌరవించింది తెలంగాణ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ మాత్రమేనని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. వీఓఏల గౌరవ వేతనాలు పెంచడంపై హర్షిస్తూ సోమవారం హుజూర్‌నగర్‌లోని సంఘ మిత్ర కార్యాలయంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి వారు పాలాభిషేకం చేసి ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. సంఘమిత్ర కార్యాలయంలో టాయిలెట్స్ నిర్మాణానికి రూ.2 లక్షలు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, ఎంపీటీసీ విజయలక్ష్మి, సెర్ప్ ఏపీఎం, సీసీ, వీఓఏలు సంఘ మిత్ర, మహిళా సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయ నిర్మాణానికి కృషిచేస్తా

హుజూర్‌నగర్ : గరిడేపల్లిలో గ్రంథాలయ నిర్మాణానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను గరిడేపల్లి గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ స్వప్న వెంకటరెడ్డి, గ్రంథాలయ చైర్మన్ రామ్‌రెడ్డి, జానకి రాములు, వినోద్, గోపాల్, నాగార్జున, కరుణాకర్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీరు విడుదల చేయాలని వినతి


ఆర్డీఓ జగదీశ్వరరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సీపీఐ, రైతు సంఘం నాయకులు

హుజూర్‌నగర్ : సాగర్ నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు యల్లావుల రాములు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొప్పోజు సూర్యనారాయణ కోరారు. ఈ మేరకు సోమవారం సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో హుజూర్‌నగర్‌లో ఆర్డీఓ జగదీశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగర్ ఆయకట్టు ప్రాంతమైన నియోజకవర్గంలో రైతులు బావులు, బోర్లు, లిఫ్టుల కింద దాదాపుగా 70 శాతం వరి, పత్తి, మిరప పంటలు సాగు చేశారని తెలిపారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల వల్ల భూగర్భ జలాలు ఇంకిపోయి లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాగర్ నీటిని విడుదల వేసి ఎండుతున్న పంటలు కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఎల్లావుల రమేష్, మామిడి నరసయ్య, గుండెబోయిన వెంకన్న, సాముల రమాదేవి, జక్కుల రమణ తదితరులు పాల్గొన్నారు.

వానలు కురవాలని శివాలయంలో పూజలు


స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

మేళ్లచెరువు : వానలు కురవాలని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని మండలంలోని శ్రీ ఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, నీరాజన మంత్ర పుష్పం నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని మంగళ వాయిద్యాలతో గ్రామ పుర వీధుల్లో ఊరేగించి గ్రామ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ కొండారెడ్డి, వర్రా వెంకటరెడ్డి, సర్పంచ్ శంకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, సీతరామయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు

హుజూర్‌నగర్ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. హుజూర్‌నగర్‌లోని పబ్లిక్ క్లబ్ వెనక బజారులో డెంగ్యూ కేసు నమోదు కావడంతో సోమవారం వైద్య, ఆరోగ్య సిబ్బందితో కలిసి దోమల లార్వా నిర్మూలనకు డై ఫ్లూ బెంజిరన్ స్ప్రే చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ ఉంటే దోమల వ్యాప్తి చెంది మలేరియా, డెంగ్యూ, బోధకాలు, తదితర వ్యాధులు వ్యాపిస్తాయని తెలిపారు. వారానికి ఒక రోజు డ్రై డే పాటించి నీటి తొట్లు, డ్రమ్ములు, ఓవర్‌హెడ్ ట్యాంకులను కడిగి ఆరబెట్టాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, ఏఎన్‌ఎం లలిత, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రూ.44 వేలు సేకరించి.. అభాగ్యుడికి అందించి


నిమ్స్ ఆస్పత్రిలో విద్యార్థికి ఆర్థికసాయం అందజేస్తున్న సామాజిక కార్యకర్త రాజేష్

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని రాంపురంనకు చెందిన అంకం సాగర్‌కు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో చేయి విరిగింది. దీంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో అతనికి సర్జరీ చేశారు. అయితే సర్జరీకి నాలుగు లక్షల రూపాయలు అవుతుండడంతో అంత డబ్బులు చెల్లించే స్థోమత లేక ఇబ్బందులు పడుతున్న సాగర్ కుటుంబం స్థానిక బీఆర్‌ఎస్ యూత్ పట్టణ అధ్యక్షుడు, సామాజిక కార్యకర్త పోకబత్తిని రాజేష్‌కు విషయం తెలియజేయడంతో అతను తన మిత్రులు, దాతల ద్వారా రూ.44 వేలు సేకరించి సోమవారం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో సాగర్‌కు అందజేశారు. తన చికిత్స కోసం సహాయం చేసిన దాతలకు సాగర్ కృతజ్ఞతలు తెలిపాడు.